# మనసు చెప్పని మాట

ఆదూరి వెంకట సీతారామమూర్తి



ఆ సన్నజాజితీగ వరం నాటిందే.

కోసుకున్నవి కోసుకోగా ఇంకా గుత్తులు గుత్తులుగా మొగ్గలు మిగిలి పోతున్నాయి.

వెదురు పందిరి నిండా అల్లుకుని ఇంకా అలా డాబా మీదికి పాకుతున్న కాశీరత్నంకూడా వరం చేతిమీదుగా ప్రాణం పోసుకుని పెరిగినదే.

కాలేజీలా, క్లబ్బులా, సినిమాలా— ఇంట్లో ఎవరి కంత శ్రద్ధ?

ఏమైనా వరం ఈ కాలపు పిల్ల కాదు. ఇంట్లో కనిపించే ప్రతి వస్తువూ వరం చేత సేవలు చేయించుకున్నదే.

వరం గురించి తలుచుకుంటేనే సుందరమ్మగారికి ఎన్నో సంఘటనలు కళ్ళముందు కదలాడాయి.

పదేళ్ళ పిల్లప్పుడు తన ఇంట్లో అడుగు పెట్టింది వరం. అప్పట్లో చామన చాయగా, అర్భకంగా ఉండేది. రెండు కళ్ళలోనూ అమాయకత, భయం సమపాళ్ళలో ఉన్నాయా అనిపించేది.

ఎప్పటినుంచో ఇంటిని కనిపెట్టుకున్న కాసులు వరాన్ని తెచ్చి కుదిర్చింది.

"ఈ కుర్రకుంకేం చేస్తుందే?" మొదట్లో ఆశ్చర్యపోయింది సుందరమ్మగారు.

"చేస్తుందం డమ్మగారూ! దాని పని నచ్చకపోతే నే నున్నానుగా?"

ఆ మరునాటినుంచీ పనిలోకి వచ్చింది వరం.

రోజూ తెల్లవారక ముందే వచ్చేది. గుమ్మాలు కడిగి ముగ్గు వెయ్యడంతో మొదలు పెట్టేది పని.

ముగ్గు లెంత చక్కగా వేసేది! దానికంటే నాలుగేళ్ళు పెద్దదయినా నానంతకు ముగ్గు లెయ్యటమే రాదు.

ఎప్పుడన్నా బద్ధకించి ఏ పనన్నా చెప్పినా 'నే చదువుకోవాలమ్మా' అని తప్పించు కుంటుంది.

పని చెయ్యక్కర లేదు కానీ, నేర్చు కుంటే తప్పు లేదుగా అనే మాటే అంటే, "ఇప్పటినుంచీ దానికి పనెందుకు, చెప్పు. రేపు పెళ్ళయితే ఎలాగూ తప్పదు" అంటూ కూతుర్ని వెనకేసుకొస్తారాయన.

గిన్నెలు తోమి గదు లూడ్చేసరికి ఎనిమిది దాటేదిగాదు. ఆ తరవాతే ఇంట్లో ఒకరూ ఒకరూ లేచేవారు.

అందరి స్నానాలకూ నీళ్ళు తోడి కుళాయి దగ్గర నీళ్ళు పట్టి పని అయిం దనిపించేసరికి పదకొండయ్యేది.

చిన్న పిల్లయినా, తీరుగా పని చేసేది వరం. రోజూ తనతో బాటే కాఫీ టిఫిన్లూ, వసంత పాతబట్టలు, పండక్కి కొత్త గానూ తప్పితే దానికి ఎక్కువ ఇచ్చిందేం లేదు.

రోజులు గడుస్తున్నాయి.

ఇంట్లో వరానికి పని బాగా పెరిగి పోయింది.

అందరి పనులూ అదే చెయ్యాలి.

"ఒసే వరం, కాఫీయ్." లేస్తూనే అరుస్తాడు వాసు.

"తొరగా నీళ్ళు తోడవే! అవతల కాలేజీకి పోవాలి." పురమాయిస్తుంది వసంత.

"కాస్త బూట్సు పాలిష్ చేసి పెట్టావేఁ!"

రామిగాడూ నేర్చాడు.

"అన్నీ బాగానే ఉన్నాయి గాని, పొద్దుటే గొప్పు లెప్పుడే తప్పేది?" అని ఆయన.

చురుకుగా అందరి పనులూ చేస్తూ ఇంట్లో మనిషిగానే కలిసిపోయేది వరం.

ఓ రోజు వరం రాలేదు. ఎక్కడి పను లక్కడే ఉండిపోయాయి. ప్రతి ఒక్కరికీ తమ కుడి చెయ్యి పడిపోయిన ట్లయిపోయింది.

"ఈ ముండ కేమైందో విర్రవీగి పోయింది" అని ఒకరూ, "తిండి చాలకపోతే చాల్లేదని ఏడవకూడదూ— మానేయక పోతే" అని ఇంకొకరూ మొదలు పెట్టారు.

వరసగా నాలుగు రోజులు మానేసిన వరం అయిదో నాడు వచ్చేసరికి ఆశ్చర్య మనిపించింది. తలంటు పోసుకుని, కొత్త ఓణీ వేసుకుని ఎంతో ఎదిగినట్టు కనిపిం చింది.

"ఇందుకంటే మానేసింది" అని ఆశ్చర్యపోతే సిగ్గుపడిపోయింది.

ఈ మూడు రోజుల భాగ్యానికే అందరూ తలో రకంగా వరాన్ని తిట్టి పోశారు.

సుందరమ్మగారి మనసు కలుక్కు మంది.

వరం ఒళ్ళు దాచుకోకుండా, ఒకరి చేత చెప్పించుకోకుండా పని చేసింది. ఇది నాకు కావాలమ్మగారూ' అని ఎప్పుడూ అడిగిన పాపాన పోలేదు.

అందుకు తనిచ్చిన ప్రతిఫల మేమిటో? సుందరమ్మగారి కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"అమ్మా, అన్నం పెట్టవూ?" రామిగాడు షికారు నుంచి వచ్చాడు.

ఆలోచనలలోంచి తేరుకుని మళ్ళీ పనిలో మునిగిపోయింది సుందరమ్మగారు.

ఆ రాత్రి పదకొండు దాటినా కంటికి నిద్ర లేదు.

మనసంతా కలవరం.

...కొనసాగు చచ్చిపోయి సంవత్సర మైపోయింది. చిన్న వయసులోనే వరం దిక్కులేని పక్షి అయిపోవటం బాధనిపించి ఒక నిర్ణయం తీసుకుంది. ఆయన కూడా ఎదురు చెప్పలేదు. అప్పటినుంచీ వరం పూర్తిగా తనింట్లోనే ఉండి పోయింది.

పిల్లలకుకూడా వరం మీద జాలి కలిగినట్లు గుర్తించి సంతోషించింది సుందరమ్మగారు.

తీరికగా ఉన్నప్పుడు కాలేజీ సంగతులు ముచ్చటించేది వసంత. సినిమా కబుర్లు చెప్పేవాడు రామిగాడు. పిల్లల పత్రికలు తెచ్చి చదవమనేవాడు వాసు. కాస్త అక్షర జ్ఞానం ఆదివరకే ఉండటం వల్ల, పుస్తకాలు చదవగలిగేది వరం.

అటువంటి వరం రేపటినుంచి తమ మధ్య తిరగదని తలుచుకుంటే సుందరమ్మగారి మనసు నిరాశతో నిండి పోయింది.

వారం రోజుల కిందటి సంగతి...

వాసు నూతి దగ్గర పీట మీద కూర్చుని స్నానం చేస్తున్నాడు. వరం దూరంగా మెట్టుమీద కూర్చుని వాసు చెబుతున్న సినిమాకథ వింటూంది.

మధ్యలో నవ్వులు వినిపిస్తే వంటింట్లోంచి అటు వైపుగా వెళుతున్న సుందరమ్మగారు తొంగి చూశారు.

వరం వాసు వీపు రుద్దుతూంది.

ఎందుకో ఆ దృశ్యం ఆమె మనసు కంతగా నచ్చలేదు. ఎంత సరిపెట్టు కుందామనుకున్నా సరిపెట్టుకోలేక పోయింది.

వయసులో ఉన్న ఏ ఆడదైనా అందం గానే కనిపిస్తుంది. వయసు తెచ్చిన ఒంపులు వరానికి కొత్త అందాన్ని తెచ్చి పెట్టాయి. సంరక్షణ లేకపోయినా బాగానే తేలింది.

వరం కంటే అయిదారేళ్ళు పెద్దవాడే వాసు.

ఆ సంఘటన మరిచిపోకముందే మరొకటి ...

సాయంత్రం అవుతూంది. మొక్క లకు నీళ్ళు పోస్తూంది వరం. ఆమె వెనకనే నడుస్తూ, నవ్వుతూ ఏదో ప్రేమకథ చెబుతున్నాడు వాసు. వింటూ పమిటచెంగుతో ముఖాన్ని దాచేసుకుం టూంది వరం.

సుందరమ్మగారిలో ఈ మాటు అనుమానం బలంగా నాటుకుంది. ఈ రోజు అన్నయితే, రేపు తమ్ముడు అవవచ్చు.

మనసులో ఉంచుకోలేక ఆయనతో చెబితే, "నీదంతా పట్టి అనుమానం లెద్దూ! వాడు కావాలనుకుంటే ఇదే దొరికిందా? 'కో' అంటే కోటి మంది. ఈ రోజుల్లో మరీనూ" అంటూ నవ్వేశా రాయన.

"ఏమో బాబూ, నాకు మాత్రం భయంగా ఉంది. వయసుకు అడ్డూ ఆపూ ఉంటుందా? కులం, గోత్రం తేడాలు తెలిసేడుస్తాయా?"


ఏది ఏమైనా వరం అలా ప్రవర్తిం చడం కష్టంగానే ఉం దామెకు. జాలిపడి చేరదీసింది వరాన్ని. దానివల్ల కొడుకులు పెడదారి తొక్కకూడదు.

ఒక వేళ కొడుకులే వరాన్ని పెడదారి తొక్కిస్తే. . .? ఆ ఆలోచననుకూడా భరించలేకపోయింది. అదే జరిగితే ఏమన్నా ఉందా? దాని బతుకు చేతులారా బండలు చేసిన పాపం తమకు చుట్టుకుంటుంది.

ఏమైనాసరే, వరం తమతో ఉండ టానికి వీలులేదు.

ఆమాటే మరునాడు ఆయనతో ప్రస్తా విస్తే, "చూడు సుందరం, ఇందులో ఎవరి తప్పెంతవరకూ ఉందో ఆలోచిం చాలి. ఈ కాలంలో దానిలా పని చేసే వాళ్ళు దొరకటం కష్టం. అయినా, ఒక్క సారి ఉన్నట్టుండి మానిపించేస్తే ఎక్కడికి పోతుం దది? ఇంతవరకూ ఆదుకున్న మనం దాని కో ఉపాధి చూపకుండా పొమ్మనడం భావ్యమా?" అన్నారు.

అదీ నిజమే. దానికి మరో పని



కుదర్చాలి. రసింట్లో పడిపోవాన్ని—పిచ్చితో మునసటిదాన్ని— కుదుర్చుకోవాలి.

వాసు వాగిసలాడే సమయంలో ఓ రోజు వాసు వసంతన్నీ వరాన్నీ కూడా పట్టుబట్టి సినిమాకు తీసుకువెళ్ళాడు.

అంతా ఉపాయంగా అనిపించింది.

అర్ధరాత్రి సన్నజాజి పందిరి చప్పుడైతే చటుక్కున లేచి చూసింది.

ప్రకృతి అంతా నిర్మలత్వాన్ని పొందు పరుచుకుని అమాయకంగా ఉంది. ఎక్కడో రైలుకూత.

లేచి డాబా మీదనుంచి చూస్తే రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. సముద్రం మీద నుంచి వచ్చే చల్లగాలికి పూలమొక్కలన్నీ జోగుతూ ఊగుతున్నాయి.

చీకూ చింతా లేకుండా నిర్మలంగా ఉండే వరం ఇప్పు డెక్క డుందో?

ఓ నిట్టూర్పు విడిచి పక్కమీద ఎడుకుని ఆకాశం వంక చూసింది. నక్షత్రాలు మెరుస్తున్నాయి.

చెప్పలేక చెప్పలేక చెప్పింది, ముందు రోజు రాత్రి అందరూ పడుకున్నాక వరాన్ని పిలిచి.

వరం నోట మాట లేదు!

కళ్ళప్పగించి అలానే ఉండిపోయింది.

క్షణం పోయాక, "అమ్మగారూ" అంది. కళ్ళలో తడి. గొంతులో జీర.

గుండె కరిగిపోకుండా ఉండటానికి తల తిప్పుకుని, "బాబుగారు నీకు మరో పని చూస్తారు, వరం. ఇంతకుమించి నన్నేం ప్రశ్నించకు" అని మరో మాట మాట్లాడకుండా వచ్చేసింది.

తెల్లారేసరికి వరం కనిపించకపోయే సరికి ఆశ్చర్యంతోబాటు అనుమానం కూడా వచ్చింది.

ఇంట్లో ఎవ్వరికీ వరం వెళ్ళిపోవడం ఇష్టం లేదు. అందరూ తన పైనే నింద వేసినట్లు చూస్తున్నారు.

సుందరమ్మగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

ఇందరిని బాధించే హక్కు తన కెవ రిచ్చారు? అటువంటి పాడు ఆలోచన తన మనసులో ఎందుకు జొరబడింది?

తెగీ తెగని ఆలోచనల్లోనే ఎప్పుడో మాగన్ను పట్టింది.



జాతినేత జాతి పిత

చిత్రం— గోలి శంకరరావు (తెనాలి)

• • •

"అమ్మా, ఓ సారిలా వస్తావా?"

వాసు పిలుపుకి వంటగదిలోకి వెళుతున్నదల్లా ఆగి చూసింది.

"నువ్వు చేసిన ఘనకార్యానికి ఏమైందో తెలుసా?"

"ఏమైందిరా?"

"వరం సముద్రంలో పడి ప్రాణాలు తీసుకుంది." సుందరమ్మగారి శరీరం లోంచి వణుకు పుట్టుకొచ్చింది. గుండె దడదడ లాడింది. శరీరమంతా చమటలు పోశాయి.

ఛీ...ఎంత అమానుషంగా, నిర్దయగా ప్రవర్తించింది! నీడ చూపిన వాళ్ళే అనుమానించి అవమానిస్తే వరం మాత్రం ఏం చేస్తుంది?

ఏం చేయాలో అదే చేసింది! ఎవరు చేసిన పాపానికి వారి నొదిలి హాయిగా ఈ లోకం నుంచే పోయింది. ఆ పాపం కట్టి కుడపక మానదు.

పెద్ద శబ్దమైతే ఉలిక్కి పడి లేచింది. ఏదో లారీ రోడ్డమ్మట వేగంగా పోతూంది.

అంతా ఎవరి నిద్రలో వా రున్నారు. నోరార్చుకు పోతూంది. లేచేందుకు కాలు కదలటం లేదు.

హమ్మయ్య! ఇదంతా కలే నన్న మాట! మనసులో కొస్తంత సంతోషం!

రెండు క్షణా లాగాక శరీరం కొస్త అదుపులోకి వచ్చింది. లేచి కూజాలోని మంచినీళ్ళు వంపుకుని తాగింది.

అప్పటికి తొలికోడి కూయటానికి రెండు గంటల టైముంది.

• • •

ఆ మరునాడు రోజూ కంటే ఆలస్యంగా లేచారు సుందరమ్మగారు. వసంత, వాసు ఎవరి పనుల్లో వా ళ్ళున్నారు.

ముఖం కడుక్కుని కూతు రిచ్చిన కాఫీ తాగి ముందు గదిలో కూర్చున్నా రావిడ. ఆవిడ ప్రవర్తన కందరూ ఆశ్చర్య పోయారు. సాధారణంగా ఉదయం పూట ఆవిడ తీరికగా కూర్చోదు.

"ఏమమ్మా, ఒంట్లో బాగా లేదా?" అడిగాడు వాసు దగ్గరి కొచ్చి.

"ఏం లేదురా—ఒళ్ళు నొప్పులు చేసిం దంతే."

"ఈ వయసులో ఇ న్ని పనంతా ఎవరు చెయ్యమన్నారమ్మా? మేమంతా లేమూ?"

ఆ మాటలకు సుందరమ్మ గారి కళ్ళలో నీరు తిరిగింది. "మీ పని మీరు చేసుకుంటే, ఇక తల్లినంటూ నే నెందుకురా ఉండేది?"

"ఎందుకా? ఉన్న పనివాళ్ళని మానిపించి మరింత పని వాళ్ళ నెత్తి నెయ్యడానికి." అందుకున్నా రాయన వీధి గుమ్మంలోంచి లోపలి కొస్తూ.

"మీ రంతా అనుకునేటంత చెడ్డ దాన్నేం కాదు నేను. నేనూ మనిషినే కాబట్టి కొన్ని బలహీనతలు నాకూ ఉన్నా యంతే" అని, "వరాన్ని నేను రమ్మన్నా నని పిలవరా, వాసూ" అంటూ కొడుకు వైపు తిరిగింది. ఆ మాటకు తండ్రీ కొడుకులూ ముఖాలు చూసుకున్నారు.

"ఎక్కడుందమ్మా — ఇంకా ఈ ఊళ్ళోనే ఉంటుందని నే ననుకోను. మనం తప్ప దాని కెవ రున్నా రిక్కడ?"

సుందరమ్మగారికి దుఃఖం ముంచు కొచ్చింది.

"నాకు తెలుసే సుందరం, నీ మనసు. అందుకే వరాన్ని నా నోటితో నేను పొమ్మనలేకపోయాను."

ఆయన మాట లింక సుందరమ్మగారి చెవులకు వినిపించలేదు.

ఆమె దృష్టి అంతా గుమ్మం వెనక నిలిచి పోయింది. అక్కడ తల వంచుకుని నిలబడి ఉంది వరం.

★